

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులతో రాచకొండ క్రైం డీసీపీ అరవింద్‌బాబు

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు ఘనంగా వీడ్కోలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ పోలీసు ఉద్యోగులు విధి నిర్వహణలో గడించిన అనుభవం వృథా కాకుండా సమాజ హితానికి తోడ్పడాలని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అన్నారు. కమిషనరేట్ పరిధిలో శనివారం పదవీ విరమణ పొందిన 12 మంది అధికారులను కమాండ్ కంట్రోల్‌రూమ్‌లో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు అధికారులను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులతో రిటైర్డ్ జీవితం ఆనందంగా గడపాలని కోరుకున్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు సిబ్బందిని క్రైం డీసీపీ అరవింద్‌బాబు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

హైదరాబాద్ సిటీ : డిసెంబర్ 14న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్ రేణుక యార అన్నారు. శనివారం సిటీ సివిల్‌కోర్టులోని తన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ లోక్‌అదాలత్‌లో మోటార్ వెహికల్ యాక్సిడెంట్, సివిల్, ఇతర కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాజీ మార్గం ద్వారా తమ కేసులను కక్షిదారులు పరిష్కారం చేసుకోవాలని జడ్జి సూచించారు.



నగర సమస్యలను బల్దియా మేయర్, కమిషనర్‌కు వివరిస్తున్న బీజేపీ కార్పొరేటర్లు

బీజేపీయేతర పార్టీలు బల్దియాను దోచుకుంటున్నాయి

● జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్ : బీజేపీ యేతర బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు బల్దియా ను దోచుకుంటున్నాయని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. కాగా ఈ సమావేశం జరుగుతున్న సమయంలో నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ కార్పొరేటర్లు కాన్ఫరెన్స్ హాల్లోకి వెళ్తున్న అధికారులను అడ్డగించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ నగరంలో సమస్యలు తీవ్రంగా నెలకొన్నాయని వివరించారు. నగరంలో నెలకొన్న సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని వారికి అందజేసినట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నియామకాలు చేయాలి

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి అన్ని శాఖల అధికారులు నియామకాలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి ఈ .వెంకటాచారి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ శాఖలలో టీజీపీఎస్సీ గ్రూప్-4 ద్వారా నూతనంగా జిల్లాలో ఎంపికైన అభ్యర్థుల నియామకాలపై శాఖల వారీగా సమీక్షించారు. జిల్లాలో వివిధశాఖలలో గల 1059 జూనియర్ అసిస్టెంట్, ఇతర పోస్టులకు అభ్యర్థులు వివిధ పోస్టులకు ఎంపికయ్యారని, వారికి డిసెంబరు 4న సీఎం చేతులమీదుగా పెద్దపల్లి జిల్లాలో ఉద్యోగ నియామక పత్రాలు అందచేస్తామన్నారు. ఉద్యోగ నియామక పత్రాల సిద్ధంతో పాటు అభ్యర్థులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు.

హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో అధికారుల తనిఖీలు

● నిబంధనలు పాటించని వారికి నోటీసులు



హోటల్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద తనిఖీలు చేస్తున్న జీహెచ్‌ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు శనివారం హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లతో పాటు బేకరీల్లో నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహించారు. చాదర్‌ఘాట్, మలక్‌పేట, గాంధీనగర్ ప్రాంతాల్లో హోటళ్లు, బేకరీ, ఫాస్ట్‌సెంటర్లలో నిబంధనలు పాటించని వారికి నోటీసులు జారీచేశారు. చాదర్‌ఘాట్‌లో సవేరా హోటల్‌లో అపరిశుభ్రమైన ఫ్లోరింగ్, మలక్‌పేటలో కోహిర్స్ అల్లం వెల్లుల్లి యూనిట్‌లో లేబుల్ లేని ప్యాకెట్లు గుర్తించారు. సలీంనగర్‌లో ఓ బేకరిలో కేకులపై వాడే పేస్ట్రీల తయారీ తేదీలు, వినియోగ తేదీలను ప్రదర్శించాలని నిర్వాహకులను ఆదేశించారు. చిక్కడపల్లి ప్రజ్ఞాభవన్ హాస్టల్‌లో అపరిశుభ్రంగా ఉన్న భోజన ప్రాంతం, అశోక్‌నగర్‌లో స్పైసీ నూడిల్ హౌస్, గాంధీనగర్‌లో మసాలాల్లో రంగులు, మహదేవ్ ఫుడ్‌కోర్టులో గడువు ముగిసిన మసాలాలు, సింథటిక్ రంగులు గుర్తించిన అధికారులు వారికి నోటీసులు జారీచేశారు. నిర్వాహకులు విధిగా నిబంధనలు పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్సీ వర్గీకరణకు అనుకూల చర్యలపై హర్షం

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకు ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకోవడంపై మాదిగ, ఎస్సీ ఉపకులాల సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. వర్గీకరణ తీర్పును స్వాగతించిన సీఎం రేవంత్‌రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆయా సంఘాలన్నీ కృతజ్ఞతలు తెలిపాయి. ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, సర్వీస్ కమిషన్ మెంబర్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్, రెండు వైస్ చాన్సలర్ పదవులు, విద్యా కమిషన్ సలహామండలి సభ్యులుగా తమ కులాల వారికి అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక కార్యదర్శి కృపాకర్ మాదిగ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్గీకరణకు వ్యతిరేకంగా పనిచేస్తున్న అసాంఘిక శక్తులను కట్టడి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సంపత్‌కుమార్‌కు హానరరీ ఫెలో ఐసీఎస్ అవార్డు



హానరరీ ఫెలో ఐసీఎస్ అవార్డును అందుకుంటున్న సంపత్‌కుమార్

మన్సూరాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డు గ్రహీత పి.సంపత్‌కుమార్(ఐసీఏస్) ఇమేజ్ కొలీగ్ సొసైటీ యూఎస్‌ఏ వారు అందించిన హానరరీ ఫెలో ఐసీఎస్ అవార్డును అందుకున్నారు. ఐసీఎస్ మెంటర్, ఫొటోగ్రఫీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు తమ్మా శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో అవార్డుల ప్రదానం జరిగింది. ఫొటోగ్రఫీ రంగంలో అందించిన సేవలకు గాను, బతుకమ్మపై నిర్వహించిన డాక్యుమెంటరీకి గాను నగరంలోని బాలాపూర్‌కు చెందిన పి.సంపత్‌కుమార్‌కు అవార్డును అందుకునే గౌరవం దక్కింది. ఈ అవార్డును ఐసీఎస్ యూఎస్‌ఏ చైర్మన్ కె.రమామోహన్‌రావు, ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ వైస్ ఛాన్సలర్ కె.గంగాధర్‌రావు, నాగార్జున యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఎం.సురేష్‌కుమార్ తదితర అతిథుల చేతుల మీదుగా అందుకోవడం పట్ల సంపత్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చాదర్‌ఘాట్ : సలీంనగర్ కాలనీల్లో అధ్వానంగా తయారైన రోడ్లన్నింటిని సీసీ రోడ్లుగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నట్లు మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. శనివారం ఆమె సలీంనగర్‌లో రూ.12లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును స్థానికులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి, గౌర దేవేందర్, గణేశ్, యాదగిరి సురేందర్, మందడి సందీప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌సీఐ రోడ్డు విస్తరణతో

ఎయిర్‌పోర్టు ప్రయాణికులకు ఊరట

● కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉంది

● రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు



ఆర్‌సీఐ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి, మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని ఆర్‌సీఐ రోడ్డు విస్తరణతో ఈ మార్గం మీదుగా ఎయిర్ పోర్టుకు వెళ్లే వాహనదారులకు, ప్రయాణికులకు ఎంతో ఊరట కలుగనున్నదని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రూ.32కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఆర్‌సీఐ రోడ్డు విస్తరణ పనులకు శనివారం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో ఫోర్త్ సిటీ ఏర్పాటుతో అభివృద్ధి వేగవంతం కానున్నదని అన్నారు. తమ ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉన్నదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నామని, ప్రతి ఒక్కరూ ఆయా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. రాష్ట్రంలోని రైతాంగానికి అన్ని విధాలుగా తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని, దళారీ వ్యవస్థ లేకుండా ప్రతి గింజనూ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో టఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ కమిషనర్ పి.సరస్వతి, కౌన్సిల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బండారి మనోహర్, మహేశ్వరీజైహింద్‌కుమార్, ఏనుగు రాంరెడ్డి, పవన్‌కుమార్‌యాదవ్, శివకుమార్, భారతమ్మాకొమురయ్యయాదవ్ పాల్గొన్నారు.

సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు పక్కా భవనాలు

● రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ సంతోష్‌రెడ్డి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ సంతోష్‌రెడ్డి

చంపాపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అద్దె భవనాలలో కొనసాగుతున్న సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు పక్కా భవనాలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ సంతోష్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని సాగర్‌రింగ్‌రోడ్‌లోని ఎల్బీనగర్ సబ్- రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శనివారం సంతోష్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయం పక్కన ఉన్న జీహెచ్‌ఎంసీ ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ హయత్‌నగర్, మహేశ్వరం, ఎల్బీనగర్‌లోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నట్లు, కొన్ని చోట్ల సరైన వసతులు లేక కార్యాలయాలకు వచ్చేవారు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వ స్థలాలు ఉంటే కార్యాలయాల నిర్మాణాల కోసం ప్రభుత్వాన్ని కోరనున్నట్లు ఆయన అన్నారు. ఎల్బీనగర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో నెలకొన్న ఇబ్బందులపై భవనం యజమానితో చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా భవనాలు రహదారి వెంట ఉండే విధంగా అద్దె లేదా సొంత భవనాల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

భవిష్యత్ రాజకీయాల్లో టీడీపీ ప్రధాన భూమిక

● టీడీపీ సీనియర్ నేత, టీటీడీ బోర్డు మెంబర్ నర్సిరెడ్డి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న నన్నూరు నర్సిరెడ్డి

చంపాపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ రాజకీయాలను శాసించే శక్తితో పాటు టీడీపీ ప్రధాన భూమిక పోషిస్తుందని టీడీపీ రాష్ట్ర సీనియర్ నాయకులు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ నన్నూరు నర్సిరెడ్డి అన్నారు. చంపాపేటలో శనివారం డివిజన్ మాజీ అధ్యక్షుడు, అడ్‌హక్ కమిటీ మెంబర్ బైగళ్ల రవీందర్ అధ్యక్షతన జరిగిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సిరెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్, అడ్‌హక్ కమిటీ సభ్యులు వై.వెంకటగాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురికి పార్టీ సభ్యత్వాలను వారు అందజేశారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ కలిసికట్టుగా ముందుకు పోయి పార్టీని బలోపేతం చేయాలని, నియోజకవర్గంతో పాటు డివిజన్‌లలో ప్రతి ఒక్కరూ నాయకులుగా ఎదగాలని కోరారు. పార్టీ సభ్యత్వం చేసుకోవడం వల్ల కుటుంబాలు లబ్ధిపొందుతాయని అన్నారు. బక్కని నర్సింహులు మాట్లాడుతూ టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సురేష్‌నాయుడు, ప్రసాద్‌బాబాయ్, సురేష్, మురళీధర్‌రెడ్డి, ఆరే కృష్ణ, విజయ్‌నేత, చంద్రశేఖర్, గిరి యాదవ్, వేణు, కట్టా యాదగిరి, ఆనంద్‌నాయుడు, వరలక్ష్మి, బి.సంతోష్ గౌడ్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

రైతు పండుగకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

ఎల్‌బీనగర్ : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలకు అండగా ఉన్నదని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో శనివారం జరిగిన రైతు పండుగకు రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలో లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లాయి. ఆయన మాట్లాడుతూ రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ చేసిందన్నారు. సన్నవడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పలుసం శ్రీధర్‌గౌడ్, యశ్వంత్‌రాజ్, గోవర్ధన్, ప్రవీణ్‌రెడ్డి, కందికంటి శ్రీధర్‌గౌడ్, సుధీర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మనోజ్, రోహిత్‌రెడ్డి, నరేందర్, శ్రీనాథ్‌రావు, శివగౌడ్, విష్ణు, జనార్దన్, చిన్నారెడ్డి, రవి పాల్గొన్నారు.

వర్క్‌ఫ్రం హోం అంటూ రూ 1.29 లక్షల మోసం

కొత్తపేట : వర్క్ ఫ్రం హోం అంటూ నమ్మించిన సైబర్ మోసగాళ్లు యువతి వద్ద రూ.1,29,913 దోచుకున్నారు. ఈ సంఘటన ఎల్‌బీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన ప్రకారం... ఎల్‌బీనగర్‌లో ఉండే ఐత మౌనిక(23) డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తోంది. నవంబర్ 28న ఇన్‌స్టాగ్రామ్‌లో వర్క్ ఫ్రం హోం రీల్ ప్రకటన చూసి, అందులో ఉన్న ఫోన్ నంబర్‌కు కాల్ చేసింది. పెన్సిళ్లు ప్యాకింగ్ చేయాలని చెప్పి, మొదట రూ.620 పంపించాలని క్యూఆర్‌కోడ్ పంపారు. ఆ తర్వాత మెటీరియల్ చార్జీలని, అదనపు లాభాలంటూ పలు విడతలుగా మొత్తం రూ.1,29,913 దోచుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి

● టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కొత్తపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ తెపారు. శనివారం పోచారం పల్లవీ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి 64మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. పార్కు గోడలపై ఉన్న ట్రాఫిక్ నిబంధనల రంగురంగుల పోస్టర్లు, వాహనాల ప్రయాణానికి అవసరమైన సూచికలనూ ఆయన వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, టీటీఐ ఏఎస్ఐ సోమ్‌నాథ్, నర్సింహారావు సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

10 అవగాహన కార్యక్రమాల్లో 710 మంది విద్యార్థులు

టీటీఐ సిబ్బంది, అధికారులు శనివారం వివిధ పాఠశాలలను సందర్శించారని, ట్రాఫిక్ నిబంధనలపైనా, సురక్షిత ప్రయాణంపైనా అవగాహన కల్పించారని ఇన్‌స్పెక్టర్ అర్జున్ తెలిపారు. 10 అవగాహన కార్యక్రమాల్లో 710 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

మూసారాంబాగ్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్ : మూసారాంబాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రూ.1.49కోట్లతో నిర్మించిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అహ్మద్ బలాల శనివారం ప్రారంభించారు. మూసారాంబాగ్ ప్రతాప్‌నగర్, మూసారాంబాగ్‌బస్తీ సాయిరాం టవర్స్‌లేన్‌లో, ప్రతాప్‌నగర్‌లోని మనోరమ ఐటీఐ లేన్‌లో, ఆరోరా కళాశాల లేన్‌లో, ఇంద్రానగర్‌లో, సలీంనగర్‌లో, గడ్డిఅన్నారం బస్తీలో, ఇంద్రానగర్‌లోని అవంతి డిగ్రీ కళాశాల లేన్‌లలో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, నందు, కృష్ణారెడ్డి, గొట్టిపర్తి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

శ్రీపురంకాలనీలో ప్రతిపాదనలు


మూసారాంబాగ్ డివిజన్‌లోని శ్రీపురం కాలనీలో రూ.2కోట్లతో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. కాలనీలోని ఏడు చోట్ల రూ.1.20కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నట్లు శనివారం శ్రీపురంకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండవరం వేణుగోపాల్‌రావు, కార్యదర్శి రామారావు, కనుకుల రవీందర్‌రెడ్డితోపాటు కాలనీవాసులతో జరిగిన సమావేశంలో వెల్లడించారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



బహదూర్‌గూడ పాఠశాలను బంద్ చేయించి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు స్టాలిన్, అరుణ్ తదితరులు

ఎల్‌బీనగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ఎల్బీనగర్ డివిజన్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎల్బీనగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మీసాల స్టాలిన్, కానుగుల అరుణ్ మాట్లాడుతూ వరుస కలుషిత ఆహార ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. కలుషిత ఆహారం తిన్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. తక్షణమే విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వారు కోరారు. కలుషిత ఆహార ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వేణు, అభి, ప్రశాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



హయత్‌నగర్ పాఠశాలను బంద్ చేయించి మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

హయత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో, వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం అవుతుందని నిరసిస్తూ వామ పక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను నిర్వహించారు. అందులో భాగంగా శనివారం హయత్‌నగర్ మండల ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వంశీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు గుండె శివ, మహేష్, శోభన్, అరుణ్‌కుమార్‌గౌడ్, వినోద్, వెంకటేష్, ఉపేందర్, బాను ప్రకాష్, శివ, వంశీ, సాయి పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వ పాఠశాలల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలను నిరసిస్తూ శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను ఎస్ఎఫ్ఐ నాయకులు బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్, జిల్లా నాయకుడు వినోద్ మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వంశీ, సాయి, వెంకటేష్, నవీన్, శ్రీశైలం పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పెళ్లి పందిరిలోనే కల్యాణలక్ష్మి చెక్కులు ఇచ్చేందుకు కృషి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రానున్న కాలంలో పెళ్లి పందిరిలోనే కల్యాణలక్ష్మి చెక్కులు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చెప్పారు. నాగోల్ డివిజన్ పరిధిలోని ఇద్దరు లబ్ధిదారులకు శనివారం చెరో రూ.1.16లక్షల కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కల్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీని నేటికీ అమలు పర్చలేదని అన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

చంపాపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్‌కాలనీ సీనియర్ సిటిజన్ సభ్యులు శనివారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కాలనీలోని సీనియర్ సిటిజన్ భవనం అసంపూర్తిగా ఉందని, భవనాన్ని పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని వారు ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా డివిజన్‌లోని ఖాద్రీకాలనీ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా కాలనీల నాయకులు, ప్రతినిధులు శ్రీనివాస్‌నాయక్, రఘుమారెడ్డి, సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షుడు సంజీవరెడ్డి, హరివర్ధన్, అల్వాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్‌ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్ కాటన్‌శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్, లక్నో చికెన్, బనారస్‌శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్ ఇతరఅనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈసందర్భంగా నిర్వాహకులు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్త కళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్ని వర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10.30ల నుంచి రాత్రి 9గంటల వరకు కాలనీవాసులకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

హయత్‌నగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సురేష్‌బాబు



ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సురేష్‌బాబు

హయత్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పి. సురేష్‌బాబును నియమిస్తూ కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం సురేష్‌బాబు హయత్‌నగర్ కళాశాలకు చేరుకుని బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు సురేష్‌బాబుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలలు సమాజానికి విలువైన సంపద : జస్టిస్ నందా



మాట్లాడుతున్న జస్టిస్ సూరేపల్లి నందా, పక్కన డైరెక్టర్ కాంతి వెస్లీ, డిప్యూటీ డైరెక్టర్ బేగ్

సైదాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బాలలు సమాజానికి ఎంతో విలువైన సంపదయని, వారి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని తెలంగాణ హైకోర్టు జస్టిస్ సూరెపల్లి నందా అన్నారు. సైదాబాద్‌లోని జువెనైల్ హోం ఆవరణలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బేగ్ పదవీ విరమణ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ మాట్లాడుతూ జువెనైల్ హోంలు పరివర్తన కేంద్రాలని, ఇక్కడి నుంచి బాలలు మంచి పౌరులుగా బయటకు వెళ్లాలని సూచించారు. జువెనైల్ శాఖ డైరెక్టర్ నిర్మల కాంతి వెస్లీ మాట్లాడుతూ విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగికి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని అన్నారు. డిప్యూటీ డైరెక్టర్‌గా బేగ్ నిబద్ధతతో పనిచేశారని జువెనైల్ శాఖ ప్రతిష్టను పెంచారని కొనియడారు. కార్యక్రమంలో హోం సూపరింటెండెంట్‌లు అఫ్జల్, సంఘమేశ్వర్, నవీన్, గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణిలో నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు : శ్వేత

సైదాబాద్: సింగరేణి గుడిసెలలో నీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపడతానని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి తెలిపారు. శనివారం సింగరేణికాలనీ గుడిసెలు రోడ్డు నెంబరు-1లో నూతనంగా రెండు బోర్లను సొంత నిధులతో వేయించారు. గుడిసెవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, స్థానికులు శివకుమార్, నాగరాజు, అశోక్, రాజు, సాయి, వేణు, మనీషా, కనకయ్య పాల్గొన్నారు.